## క్లుప్తంగా

### అంబర్‌పేట్ సర్కిల్ డీఎంసీ బదిలీ


డీఎంసీ వేణుగోపాల్

అంబర్‌పేట: జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ వేణుగోపాల్ బదిలీ అయ్యారు. మంగళవారం వెలువడిన బదిలీల్లో భాగంగా ఆయన జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌గా అంబర్‌పేట సర్కిల్‌కు ఆయన గత మూడేళ్లుగా సేవలు అందించారు.

### బీజేపీ నేతల టిఫిన్ బాక్స్ బైఠక్


బీజేపీ నేత ఎన్.గౌతంరావు తదితరులు

కాచిగూడ: కేంద్రం సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో టిఫిన్ బాక్స్ బైఠక్ కీలకమని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. మంగళవారం అంబర్‌పేట నియోజకవర్గంలోని ఓయూ కాలనీలో నిర్వహించిన టిఫిన్ బాక్స్ బైఠక్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి తీసుకురావడానికి సలహాలు, సూచనలు తీసుకునేందుకు ఈ బైఠక్ ముఖ్యపాత్రను పోషిస్తుందన్నారు. పార్టీ నేతలు వెంకట్‌రెడ్డి, పాపారావు, ఆనంద్‌గౌడ్, కేశబోయిన శ్రీధర్ తదితరులున్నారు.

### అగ్ని ప్రమాద బాధితులకు న్యాయం చేయాలి

ముషీరాబాద్: దోమలగూడలోని రోజ్ కాలనీలో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో మృతి చెందిన ఆరుగురికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ ఘటన జరిగి 10 రోజులు దాటినప్పటికీ గాయపడిన ఏడుగురిలో ఆరుగురు మరణించినా స్థానిక అధికారులు, ప్రభుత్వం ఇంత వరకు ఎలాంటి నష్టపరిహారం అందజేయకపోవడం సిగ్గుచేటన్నారు. పద్మారావునగర్‌కు చెందిన శ్యామ్‌కుటుంబంలో భార్యతో పాటు ముగ్గురు చిన్నారులు మరణించిన విషయం తెలిసిందే. బాధితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

### అన్నదానం



కాచిగూడ: అన్నదానం మహాదానమని అన్నదానం చేసి ఆకలితో ఉన్నవారిని ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు కన్నె రమేష్‌యాదవ్ అన్నారు. మంగళవారం చెప్పల్‌బజార్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆర్.సంతోష్, వాసు, రవి, భీమ్‌రాజ్, ప్రకాష్ పాల్గొన్నారు.

### విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ముషీరాబాద్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కన్స్యూమర్ గ్రీవెన్సెస్ సమావేశం 19న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ (హైదర్‌గూడ) ఎం.రామ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్, టెక్నికల్ మెంబర్, కన్స్యూమర్ ఎఫైర్స్ మెంబర్ హాజరవుతున్నట్లు తెలిపారు. దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ సమస్యలు, బిల్లుల్లో హెచ్చుతగ్గుల విషయంలో కూడా ఫిర్యాదు చేసి వినియోగదారులు పరిష్కారం పొందవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాల్సిందిగా ఆయన కోరారు.

### చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

చిక్కడపల్లి: గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందినట్లు దోమలగూడ పోలీసులు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. అశోక్ నగర్‌లోని ఏసీటీసీ కళాశాల వద్ద ఫుట్‌పాత్‌పై ఓ గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నాడనే సమాచారంతో అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. స్థానికులను విచారించగా మృతుడు బిక్షాటన చేసేవాడని సమాచారం. ఈ నెల 17న రాత్రి 10.30 గంటల సమయంలో మృతి చెందాడన్నారు. ఈ మేరకు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని తెలిపారు.

# అక్రమార్కులపై చర్యలు తీసుకోండి

- సీఈఓలకు రక్షణ శాఖ ఉత్తర్వులు
- 'మరమ్మతు' సాకుతో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు
- సహించొద్దంటూ రక్షణ శాఖ పెద్దలు ఆదేశాలు


బేగంపేట ఎయిర్‌పోర్టు గోడ సమీపంలోని ఓల్డ్ గ్రాంట్ బంగళా స్థలంలో రాత్రిపూట కొనసాగుతున్న అక్రమ నిర్మాణం

కంటోన్మెంట్: 'కంటోన్మెంట్‌లలో పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు.. సకాలంలో చర్యలు తీసుకోకపోవడంతో పెద్ద ఎత్తున వెలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది' అంటూ పార్లమెంట్ అష్యూరెన్స్ కమిటీ చైర్మన్ రాజేంద్ర అగర్వాల్ నేతృత్వంలోని కమిటీ అభిప్రాయపడింది. ఈ నెల ఆరో తేదీన మీరట్‌లో భేటీ అయిన కమిటీ రక్షణ శాఖ ఉన్నతాధికారులకు కీలక ప్రశ్నలతో పాటు పలు సూచనలు చేసింది. తదనుగుణంగా డీజీడీఈ కార్యాలయ అధికారులు దేశంలోని అన్ని కంటోన్మెంట్‌ల సీఈఓలు, డీఈఓలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. 'రిపేయిర్స్' పేరిట అక్రమ నిర్మాణాల్లో జరిగే మరమ్మతులను ఉపేక్షించ వద్దని సూచించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చేపట్టే నిర్మాణాలకు 'పీపీఈ' నోటీసులు జారీ చేయడంతో కోర్టులలో ప్రభుత్వ వాదనలను సమర్థంగా వినిపించాలని ఆదేశించారు. తద్వారా ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, ఆక్రమ నిర్మాణాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని పేర్కొన్నారు. బోర్డు దృష్టికి వచ్చిన అక్రమ నిర్మాణాలను సీఈఓ లేదా సంబంధిత అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాల్సిందే అని స్పష్టం చేశారు.

#### ఏమిటీ మరమ్మతులు ?

భవన నిర్మాణ మరమ్మతులకు సంబంధించి కీలక సవరణలు చేస్తూ రక్షణ శాఖ 2019 డిసెంబర్‌లో ప్రత్యేక ఉత్తర్వులు ఇచ్చింది. కంటోన్మెంట్‌లలో భవనాల మరమ్మతులకు సంబంధించి 'ల్యాండ్ పాలసీ 1995'లో స్పష్టత లేదంటూ, కంటోన్మెంట్ బోర్డుల పనితీరుపై ఏర్పాటు చేసిన ఎక్స్‌పర్ట్ కమిటీ అభిప్రాయ పడింది. ఈ నేపథ్యంలో ది కంటోన్మెంట్స్ యాక్ట్ 2006, సెక్షన్ 235 ప్రకారం నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేని 'రిపేయిర్స్' జాబితాను రూపొందించాలని కమిటీ సూచించింది. తదనుగుణంగా బోర్డు పరిధిలోని అనుమతులతో నిర్మించిన భవనాల్లో మరమ్మతులకు సంబంధించి రక్షణ మంత్రిత్వ శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సంబంధిత బోర్డులలో చర్చించి, ప్రజలకు సమాచారం ఇవ్వాలి అంటూ బోర్డుల పరిపాలన అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

#### వారిని వేధించొద్దు..

'మెటీరియల్ ఆల్టరేషన్' నిబంధన బోర్డు అనుమతి పొందిన భవనాలకు మాత్రమే వర్తిస్తుందని భావించిన అధికారులు, ఓల్డ్ గ్రాంట్ బంగళాల్లో మరమ్మతులను అడ్డుకుంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రిత్వ శాఖ గత నెలలో మరో కీలక ఉత్తర్వులు వెలువరించింది. జనరల్ ల్యాండ్ రికార్డ్స్ ప్రకారం 'హోల్డర్ ఆఫ్ ఆక్యుపెన్సీ రైట్స్' (హెచ్‌ఓఆర్)లో పేర్కొన్న వ్యక్తి కాకపోయినప్పటికీ, ఇతరులు ఎవరైనా ఓల్డ్ గ్రాంట్ బంగళాల్లో రిపేయిర్స్ చేసుకునేందుకు బోర్డు అనుమతి పొందాల్సిన అవసరం లేదు అని పేర్కొంది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి సిబ్బంది సాధారణ ప్రజానీకాన్ని వేధించొద్దు అంటూ కఠినంగా హెచ్చరించింది. నిబంధనలు పాటించే వారిని వేధించొద్దు అంటూనే అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందే అంటూ రక్షణ శాఖ ఉన్నతాధికారులు పేర్కొనడం గమనార్హం

## పేద క్రైస్తవ మహిళలకు 'సీఎం కేసీఆర్ కానుక' హర్షణీయం


సమావేశంలో మాట్లాడుతున్న గోనె సాల్మన్‌రాజ్

చిక్కడపల్లి: రాష్ట్రంలో 119 నియోజకవర్గాల్లో స్వయం ఉపాధి కల్పించేందుకు పేద క్రైస్తవ మహిళలకు సీఎం కేసీఆర్ కానుక పేరిట 2వేల కుట్టుమిషన్లు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని 'తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ పాస్టర్స్ అసోసియేషన్' (టీయూసీపీఏ) ప్రధానకార్యదర్శి గోనె సాల్మన్‌రాజ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం ప్రత్యేక పథకాలు అమలు చేయడం అభినందనీయమని కొనియాడారు. బిషప్ తిమోతి, ఉపాధ్యక్షుడు జోయల్, బైనొని రిచర్డ్, పురుషోత్తం, జయకుమార్, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఎన్‌ఎం పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జి.రాంబాబుయాదవ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎం పోస్టులకు నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్, మంగళవారం తెలంగాణ సెకండ్ ఏఎన్‌ఎంస్ అసోసియేషన్ (ఎంపీహెచ్‌ఏ-ఎఫ్) ఆధ్వర్యంలో మంత్రి హరీష్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ.. మంగళవారం ఎన్నికలు వస్తే నోటిఫికేషన్ ఆగిపోతుందేమోనని ఏఎన్‌ఎంలు భయపడుతున్నారని అందుకే గతంలో మంత్రి ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఖాళీ ఉద్యోగాలకు నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని కోరారు. ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని వయో పరిమితిని 55 ఏళ్లకు పెంచాలని కోరారు. ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలను కల్పించాలన్నారు. కొన్ని సంఘాలు ఏఎన్‌ఎంలను ప్రలోభాలకు గురిచేస్తున్నారని వారి మాటలను నమ్మొద్దని సూచించారు. సెకండ్ ఏఎన్‌ఎంస్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సీ.హెచ్. అనురాధా, ప్రధాన కార్యదర్శి రాధా, కార్యదర్శి సరస్వతీ, సభ్యులు విజయ, మమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమానికి చర్యలు

చిక్కడపల్లి: కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి సీఎం కేసీఆర్ తగిన చర్యలు తీసుకుంటున్నారని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర కనీసవేతనాల సలహామండలి చైర్మన్‌గా నియమితులైన నారాయణ జన్మదినం సందర్భంగా అభినందన సభ సందర్భంగా మంగళవారం ఆర్టీసీక్రాస్ రోడ్స్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ కార్యాలయం ఆవరణలో ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమంతో పాటు కార్మిక, ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి సభ్యులు బి.శివకుమార్, కె.శివశంకర్, కె.శంకర్‌రెడ్డి. ఎం.నర్సింహ, అధ్యక్షులు జి.రాంబాబుయాదవ్, రూప్‌సింగ్, ముఠాజైసింహ, వేముల మారయ్య, రమణారెడ్డి, శివశంకర్, ప్రభాకర్ మాధవరెడ్డి, జయరాజు, కిరణ్, సంతోష్, నరహరిరెడ్డి, మాధవ్, యనమల రాజు, కార్మిక కమిషనర్ అహ్మద్‌నదీమ్, అదనపు కమిషనర్లు గంగాధర్, చంద్రశేఖరం, చతుర్వేది, డీసీఎల్ శ్యామ్‌సుందర్‌రాజు, ఉద్యోగులు, అధికారులు పాల్గొని నారాయణకు అభినందలు తెలిపారు.

## సత్కారం


బండారు విజయలక్ష్మిని సత్కరిస్తున్న బీజేపీ నేతలు

కాచిగూడ: తెలంగాణ సంస్కృతికి బోనాల వేడుకలు ప్రతీకగా నిలుస్తాయని హరియాణా గవర్నర్ దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా కాచిగూడ, చెప్పల్‌బజార్ యూత్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరానగర్ నల్లపోచమ్మ దేవాలయం వద్ద మంగళవారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బోనాల వేడుకల్లో పాల్గొన్న వివిధ పార్టీల ప్రతినిధులు, వేడుకలకు సహకరించిన ప్రతి ఒక్కరిని అసోసియేషన్ అధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్ ఘనంగా సత్కరించి అభినందించారు. కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, మల్లేష్‌యాదవ్, సురేష్‌యాదవ్, రవియాదవ్, శ్రీశైలం, ఎస్.రవి యాదవ్, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రాజ్‌కుమార్, శ్రీమంత్, సాయికిరణ్, పరశురామ్, వెంకటేష్, సాయిబాబా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ గెస్ట్ లెక్చరర్లను విధుల్లోకి తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర తదితరులు

కాచిగూడ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గత పదేళ్లుగా గెస్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్న వేలాదిమందిని తొలగిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని 'ఏఐవైఎఫ్' రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్రలు డిమాండ్ చేశారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ వ్యతిరేక ప్రభుత్వమని, ఉద్యోగ ఉపాధిని కల్పించాల్సిన పాలకులు హక్కులను హరిస్తున్నారని ఆరోపించారు. వాస్తవానికి ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు ఏళ్లు గడిచినా భర్తీ చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నదని వారు ధ్వజమెత్తారు. వారి తొలగింపుతో వేలాది కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతారని దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఏఐవైఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తుందని వారు హెచ్చరించారు. ఏఐవైఎఫ్ నేతలు శ్రీకాంత్, సత్యప్రసాద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# సంయుక్త కిసాన్‌మోర్చా పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పశ్య పద్మ, చంద్రశేఖర్

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా రాసిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకురాలు పశ్యపద్మ డిమాండ్ చేశారు. రైతులకు అనుకూలంగా ఫసల్‌బీమా పథకాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ.. ఈనెల 31 న హైదరాబాద్ సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర సదస్సును సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ముగ్దూమ్‌భవన్‌లో సంయుక్త కిసాన్‌మోర్చా రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. టి.సాగర్, రాయల చంద్రశేఖర్, ప్రభాకర్, వెంకన్న, బిక్షపతి, మట్టయ్య, నాగిరెడ్డి, ప్రమీల, వెంకటయ్య, పాపయ్య, భాస్కర్, కాంతయ్య, తూడా రామ్‌నాయక్, శోభన్, ప్రభులింగం పాల్గొన్నారు.

## వైద్యరత్న అవార్డు ప్రదానం



వైద్యరత్న అవార్డును బహుకరిస్తున్న రమణాచారి, ఓంకార్‌రాజు

చిక్కడపల్లి: సత్య సంగీత ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో ఇటీవల డాక్టర్స్ డే సందర్భంగా ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ దయాసాగర్‌రావుకు వైద్యరత్న అవార్డును బహుకరించి సత్కరించారు. ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి ముఖ్యఅతిథిగా హాజరై అవార్డును అందజేశారు. నిర్వాహకులు ఓంకార్ రాజు, కాంగ్రెస్ నేత శ్రీమణి పాల్గొన్నారు.

## విద్యానగర్‌లో రోడ్డు ప్రమాదం

డీసీఎంను ఢీ కొట్టిన కారు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

నల్లకుంట: రోడ్డు ప్రమాదంలో కారు ముందుభాగం దెబ్బతిన్న ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్షం పడుతున్న కారణంగా మంగళవారం ఉదయం 9.30 గంటల సమయంలో విద్యానగర్ ఏఎంఎస్ ఎదురుగా వాహన తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులను చూసిన ఓ వ్యక్తి తన డీసీఎం(టీఎస్12యూపీ8744)ను రోడ్డు పక్కన నిలిపాడు. అదే సమయంలో మారుతి స్విఫ్ట్ (ఏపీ 09సీహెచ్ 2043) నంబరు గల కారు వీఎస్‌టీ నుంచి వస్తూ.. హిందీ మహావిద్యాలయ సిగ్నల్స్ వద్ద అడిక్‌మెట్ వైపు తిరిగి డీసీఎం వెనుకభాగంలో ఢీ కొట్టాడు. దీంతో కారు ముందు బానెట్ పైభాగం దెబ్బతింది. కారు నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలుకాగా.. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు ప్రమాదానికి గురైన కారు, డీసీఎంలను పక్కకు జరిపించారు. కారు, డీసీఎం యజమానులు రాజీ పడడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదని సమాచారం.

## సమస్య పరిష్కారానికి వినతి


డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఫాదర్లు

లాలాపేట: హైదరాబాద్ ఏసీ గార్డ్స్ ప్రాంతానికి చెందిన హోలీ చర్చి క్రైస్తవ సంఘం ప్రతినిధి బృందం మంగళవారం తార్నాకలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డిని కలిసి చర్చి వద్ద నెలకొన్న పారిశుధ్యం సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. చర్చి ప్రధాన ద్వారం వద్ద ఉన్న చెత్త డంపర్ బిన్స్‌తో ఆ పరిసరాలన్నీ దుర్గంధంగా మారి చర్చికి వచ్చే భక్తులతో పాటు చర్చి కాంపౌండ్‌లో కొనసాగుతున్న రోచ్ మెమోరియల్ హైస్కూల్ విద్యార్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. సానుకూలంగా స్పందించిన డిప్యూటీ మేయర్ వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలనీ సూచించారు. ఫాదర్ మైకిల్ సెల్వరాజ్, అనీల్ పాల్గొన్నారు.

## సీపీఆర్‌పై ట్రాఫిక్ పోలీసులకు అవగాహన


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బైబిల్ హౌస్ సమీపంలోని మహంకాళి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సీపీఆర్‌పై అవగాహన నిర్వహించారు. ట్రాఫిక్ శిక్షణ కేంద్రం ఏసీపీ శంకర్ రాజు, ఉస్మానియా వైద్యులు డాక్టర్ అశోక్ రెడ్డి, డాక్టర్ యాసీన్ తిప్పు, డాక్టర్ యజ్ఞ సీపీఆర్, ఫిట్స్, ఊపిరితిత్తుల పునరుజ్జీవనం, ప్రాథమిక చికిత్స, అత్యవసర పరిస్థితుల్లో వైద్య పరంగా ఎలాంటి సహకారం అందించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. గుండెపోటుకు గురైనప్పుడు సీపీఆర్ ద్వారా ఊపిరితిత్తులను పునరుజ్జీవం జరిగేలా ప్రాథమిక చికిత్స అందించాలో డెమో ద్వారా వివరించారు. ఈ సందర్భంగా శంకర్ రాజు మాట్లాడుతూ.. పోలీసులు విధి నిర్వహణతో పాటు ఎవరైనా ఆకస్మికంగా అస్వస్థతకు గురైతే వైద్యులుగా మారి వైద్య సేవలు అందించాలని కోరారు. ముఖ్యంగా ట్రాఫిక్ పోలీసులు రోడ్డుపై ఎంతో మంది వాహనచోదకులు, పాదచారులు వెళ్తుంటారు. వారిని ఆరోగ్యపరంగా ఆదుకోవాలన్నారు.

# రేపు ప్లాస్టిక్ నివారణపై అవగాహన ర్యాలీ

చార్మినార్: జాతీయ ప్లాస్టిక్ నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 20న తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గౌలిపురా జ్ఞాన భారతి మోడల్ హై స్కూల్ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ (టీసీసీ) రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్, టీసీసీ పాతబస్తీ అధ్యక్షులు ఎస్. రామకృష్ణ శాస్త్రి తెలిపారు. ముఖ్యఅతిథులుగా ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తం రెడ్డి, తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ పాల్గొని అవగాహన ర్యాలీ ప్రారంభిస్తారన్నారు. ప్లాస్టిక్ వస్తువులు, బ్యాగ్‌లతో కలిగే అనర్థాలు, నివారణపై ప్రసంగిస్తారన్నారు. ఆయనతో పాటు ప్రముఖ విద్యావేత్త వి.ప్రభాకర్, లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సౌత్ డైరెక్టర్ లయన్ ప్రేమ్‌చంద్ మనోత్ జైన్‌లు పాల్గొంటారన్నారు. 30 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణకై ర్యాలీలు, సదస్సుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్యవంతులను చేస్తున్న ప్రముఖ పర్యావరణవేత్త ప్రొ. పురుషోత్తంరెడ్డి, తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మహేశ్ అగర్వాల్‌ను సన్మానించనున్నామన్నారు.


## గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పంజగుట్ట: ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులకోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజేంద్ర కుమార్ తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను 27 మంది అతిథి అధ్యాపకుల పోస్టుల కోసం ఈ నెల 22 లోగా ఖైరతాబాద్‌లోని కాలేజీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంగ్లిష్ 4, సంస్కృతం 2, వాణిజ్యశాస్త్రం (కామర్స్ 03), బీబీఏ 3, డాటాసైన్స్ 01, మ్యాథమెటిక్స్ 01, స్టాటిస్టిక్స్ 02, న్యూట్రీషన్ 01, అరబిక్ 01, కంప్యూటర్ సైన్స్ 08, టాక్సేషన్ 01, పోస్టులు ఉన్నాయన్నారు.

## మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలు అందుబాటులో ఉండాలి

లాలాపేట: భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలనీ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డి సూచించారు. మంగళవారం తార్నాకలోని తన కార్యాలయం నుంచి వర్షాకాల పరిస్థితులపై ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. గత రెండు రోజుల నుంచి నగరంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోడ్లపై వర్షం నీరు నిల్వకుండా గుంతలు పూడ్చాలని ఆదేశించారు. వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. వర్షాకాలం ముగిసే వరకు మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలు ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

## నోట్‌బుక్స్ పంపిణీ


నోట్‌బుక్స్‌ను పంపిణీ చేస్తున్న డాక్టర్ ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేని తదితరులు

అబిడ్స్: టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేపట్టారు. టీఎన్జీఓస్ సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేని మంగళవారం విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నాయన్నారు. సీఎం కేసీఆర్ స్ఫూర్తితోనే తాను సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విక్రమ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, నరేష్, ఖాలీద్ అహ్మద్, వైదిక్ శాస్త్రి, శంకర్, ఎంఏ ముజీబ్, రామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, చాంద్‌పాషా, చంద్రశేఖర్, హెచ్‌ఎం సైదా షానాజ్, ఉస్మాన్ అలీ, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## 62 కిలోల గంజాయి స్వాధీనం

సికింద్రాబాద్: రైలులో అక్రమంగా రవాణా చేస్తున్న 62 కిలో గంజాయిని సికింద్రాబాద్ రైల్వే రక్షణదళం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ డివిజన్ ఆర్‌పీఎఫ్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ దేబశ్మిత చటోపాధ్యాయ బెకర్జీ కథనం ప్రకారం.. ఆపరేషన్ నార్కోస్‌లో భాగంగా మఫ్టీ దుస్తుల్లో ఆర్‌పీఎఫ్‌కు చెందిన మహిళా పోలీసు బృందాలను ఈనెల 17న డివిజన్ పరిధిలోని అన్ని రైల్వేస్టేషన్లలో మూకుమ్మడి తనిఖీలకు దింపారు. ఇందులో భాగంగా కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఖమ్మం నుంచి కాజీపేట వరకు తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన ఇరువురు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్న బ్యాగులను తనిఖీ చేయగా అందులోంచి 62 కిలోల గంజాయి బయటపడింది. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ ఏడాదిలో 21 రైళ్లలో నిర్వహించిన తనిఖీల్లో రూ.6.7కోట్ల విలువ చేసే గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని 23 మంది నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

# జోరుగా ఫలహార బండ్ల ఊరేగింపు


పాల్గొన్న మంత్రి తలసాని


ఊరేగింపులో భారీగా పాల్గొన్న భక్తులు, ప్రజలు


ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ముషీరాబాద్: బోనాల సంబరం ఫలహార బండ్ల ఊరేగింపు తెల్లవారుజాము 4 గంటల వరకు ప్రజలను ఆకట్టుకుంది. కళాకారుల ప్రదర్శనలతో ఈ ఊరేగింపు కనులపండువగా మంగళవారం ఉదయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు రాజకీయ ప్రముఖులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తలారి శ్రీకాంత్‌ముదిరాజ్, కాసాని జ్ఞానేశ్వర్, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, ముఠా జైసింహ, సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ పార్లమెంట్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్ సుప్రీయానవీన్‌గౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్, అశోక్‌కుమార్, నరేష్, నాయకులు సోమన్, సునీల్, తలసాని సైకిలాబ్, రోహిత్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- అడిక్‌మెట్ డివిజన్ అఖిల్ ఆధ్వర్యంలో ఫలహారపు బండ్ల ఊరేగింపు రాంనగర్‌గుండు నుంచి జెమినికాలనీ పోచమ్మ దేవాలయం వరకు అర్ధరాత్రి 2 గంటల వరకు కొనసాగింది. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

చిక్కడపల్లి: ఎస్‌ఆర్‌టీ నల్లపోచమ్మ, ఉప్పలమ్మ దేవాలయం ఆధ్వర్యంలో బోనాల పండుగ సందర్భంగా తొట్టెల, ఫలహారబండి ఊరేగింపు ఘనంగా జరిగింది. గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జవహర్‌నగర్ మెయిన్‌రోడ్డు, కాలనీ ప్రాంతాల్లో ఊరేగింపు వేడుకగా సాగింది. ఆలయ నిర్వాహకులు నర్సింగ్‌రావు, బాబ్జీ, భారత్, సంతోష్ పాల్గొన్నారు.